# రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



నస్రుల్లాబాద్‌లో చలో వరంగల్ వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



బాన్సువాడలో చలో వరంగల్ పోస్టర్లను అతికిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డి రూరల్/బాన్సువాడ/ నస్రుల్లాబాద్, ఏప్రిల్ 19: ఈ నెల 27వ తేదీన వరంగల్ జిల్లా ఎల్కతుర్తితో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని పార్టీ ఎల్లాడ్డి మండల, పట్టణ అధ్యక్షులు జలంధర్‌రెడ్డి, ఆదిమూలం సతీశ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఎల్లారెడ్డి పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే ఫాంహౌస్‌లో రజతోత్సవ మహాసభకు సంబంధించిన గోడ ప్రతులను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు మండలంలోని అన్ని గ్రామాల నాయకులతో సమావేశం నిర్వహించామన్నారు. ఏప్రిల్ 27వ తేదీన ఎల్కతుర్తిలో నిర్వహించనున్న సభకు ఎల్లారెడ్డి మండలం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు హాజరుకావాలన్నారు. గోడప్రతులతోపాటు క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరించారు.

కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఏగుల నర్సింహులు, నాయకులు శ్రావణ్‌కుమార్, సాయిలు, అరవింద్‌గౌడ్, బబ్లూ, మల్లారెడ్డి, నాగం రాజయ్య, బొగ్గు సాయిలు, గంగారెడ్డి, గోలి వసంతం విఠల్, లక్ష్మణ్ తదితరులున్నారు. నస్రుల్లాబాద్‌తోపాటు నాచుపల్లిలో బాన్సువాడ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జుబేర్ 'చలో వరంగల్' వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమం లో బీఆర్‌ఎస్ నాయకులు నర్సింహులు గౌడ్, అఫ్రోజ్, సాయిలు, రాములు, రాజు, రమేశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే రజతోత్సవ సభకు స్వచ్ఛందంగా తరలివెల్దామని బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ పిలుపునిచ్చారు. బాన్సువాడ మండలం బోర్లంలో నాయకులు లక్ష్మణ్, అనిల్ చలో వరంగల్ వాల్‌పోస్టర్లను అతికించారు.

**నేడు బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం**

మాచారెడ్డి, ఏప్రిల్ 18 : ఉమ్మడి మాచారెడ్డి మండల బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశాన్ని గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్ గ్రామంలోని శివబాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పగడాల బాల్‌చంద్రం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 న వరంగల్ జిల్లాలో నిర్వహించే బీఆర్‌ఎస్ సిల్వర్ జూబ్లీ కార్యక్రమంపై విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించే సమావేశానికి ఉమ్మడి మాచారెడ్డి మండలంలోని ఆయా గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

# అర్హుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

**కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**



ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొత్తగా వచ్చిన ప్యాడీక్లీనర్ యంత్రం పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 19: ఇందిరమ్మ ఇండ్ల అర్హుల ఎంపికను పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. ఎల్లారెడ్డిలోని ఆర్డీవో కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల సర్వే, తాగునీటి సమస్యలపై పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనర్హులకు ఎట్టి పరిస్థితుల్లో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయరాదన్నారు. లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులను ప్రారంభించాలన్నారు. రేషన్ కార్డుల సర్వే పారదర్శకంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. సమావేశంలో ఆదనపు కలెక్టర్లు విక్టర్, చందర్‌నాయక్‌లు, జిల్లా పంచాయతీ అధికారి మురళి, డివిజనల్ పంచాయతీ అధికారి సురేందర్, ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కుమార్ తదితరులున్నారు.

**జిల్లాలో 57వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు**

జిల్లాలో ఇప్పటివరకు 57వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొత్తగా వచ్చిన ప్యాడీ క్లీనర్ యంత్రాన్ని శనివారం ప్రారంభించి, దాని పనితీరును పరిశీలించారు. యంత్రం గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 446 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు చెప్పారు. దాంట్లో 183 ఐకేపీ సెంటర్లు, మిగతా 263 కొనుగోలు కేంద్రాలు సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విక్టర్, ఆర్డీవో మన్నె ప్రభాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ మారెడ్డి రజితారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయ ణ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సామెల్, సొసైటీ సీఈవో విశ్వనాథం, సొసైటీ సిబ్బంది, మార్కెట్ కమిటీ సెక్రటరీ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**కొనుగోలును వేగవంతం చేయాలి**

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వీడియె కాన్ఫరెన్‌లో జిల్లా అధికారులకు సూచించారు. ఎల్లారెడ్డిలోని ఆర్డీవో కార్యాలయంలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వీసీలో మంత్రి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలని, ఎండాకాలంలో నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎటువంటి సమస్యలు, ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ విక్టర్, అధికారులు ఉన్నారు.

**భూభారతిలో అన్ని రకాల అప్లికేషన్లు**

ఎల్లారెడ్డి మండలం మీసన్‌పల్లి రైతు వేదికలో శనివారం ఏర్పాటుచేసిన భూభారతి చట్టంపై అవగాహన సదస్సులో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పాల్గొన్నారు. ప్రజలకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. కొత్తగా ఏర్పాటుచేసిన భూభారతి చట్టంపై జిల్లాలోని ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. భూభారతిలో అన్ని రకాల అప్లికేషన్స్ ఉన్నాయన్నారు. హక్కుల రికార్డులో తప్పుల సవరణ చేసుకోవచ్చని ఆయన చెప్పారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయడానికి ముందు భూముల సర్వే, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం జరుగుతుందని పేర్కొన్నారు. తహసీల్దార్ చేసిన మ్యుటేషన్‌లపై లేదా జారీ చేసిన పాసుపుస్తకాలపై అభ్యంతరాలు ఉంటే ఆర్డీవోకు అప్పీలు చేసుకోవచ్చని సూచించారు. ఆర్డీవో ఇచ్చిన తీర్పుపై అభ్యంతరం ఉంటే కలెక్టర్‌కు అప్పీలు చేసుకోవచ్చన్నారు. కలెక్టర్ ఇచ్చిన తీర్పుపై అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్‌కు అప్పీలు చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో మన్నె ప్రభాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ మారెడ్డి రజితారెడ్డి, తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, ఎంపీడీవో ప్రకాశ్, గ్రామస్తులు, రైతులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పోక్సో కేసు నమోదు

లింగంపేట(తాడ్వాయి), ఏప్రిల్ 19 : తాడ్వాయి మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. సదరు యువకుడు అదే గ్రామానికి చెందిన మైనర్ (15) మాయమాటలు చెప్పి లోబరుచుకున్నట్లు తెలిపారు. సదరు బాలికపై పలుమార్లు లైంగికదాడి చేయడంతో ఆమె గర్భం దాల్చినట్లు తెలిపారు. సదరు బాలిక గర్భం దాల్చిన విషయం తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు యువకుడిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అతడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ తెలిపారు. డీఎస్పీ వెంట స్థానిక ఎస్సై వెంకటేశ్వర్లు ఉన్నారు

## నాటుతుపాకీతో సంచరిస్తున్న ఇద్దరిపై..

లింగంపేట(తాడ్వాయి), ఏప్రిల్ 19 : నాటు తుపాకీతో కల్లు దుకాణం వద్ద సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. తాడ్వాయి మండలంలోని కన్‌కల్ గ్రామానికి చెందిన తిలిపిత్ మహేందర్‌సింగ్, బాన్సువాడ మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన తిలిపిత్ ఇందర్‌సింగ్ తాడ్వాయిలోని కల్లు దుకాణం వద్ద నాటు తుపాకులు కలిగి ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకొని విచారించగా ఎలాంటి అనుమతులు లేకుండా నాటు తుపాకులు కలిగి ఉన్నందున వారి వద్ద నుంచి వాటిని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

రామారెడ్డి, ఏప్రిల్ 19 : మండలంలోని రెడ్డిపేట్‌లో గుడిసె దగ్ధమైన ఘటన చోటు చేసుకున్నది రామారెడ్డి ఆర్ఐ రవికాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తలారి లక్ష్మి గుడిసెకు షార్ట్‌సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలు ఆర్పివేశారు. రూ.50 వేల ఆస్తినష్టం సంభవించినట్లు ఆర్ఐ తెలిపారు.

## పోస్టర్ల ఆవిష్కరణ

కామారెడ్డి, ఏప్రిల్ 19 : జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ మహాసభల గోడ ప్రతులను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ముదాం అరుణ్ మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లా కేంద్రంలో ఈ నెల 25 నుంచి 27 వరకు నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఐదో మహాసభలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాహుల్, నవీన్, సుధీర్, నితిన్, రాజు పాల్గొన్నారు.

## సమాచారం ఇవ్వాలి

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 19 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నామని, రైతులకు ఇబ్బందులు ఎదురైతే సమాచారం ఇవ్వాలని ఐకేపీ ఏపీఎం ప్రసన్నారాణి అన్నారు. మండలంలోని మాచాపూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్య కొనుగోలు కేంద్రాన్ని ఆమె శనివారం పరిశీలించారు.

# బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి

కామారెడ్డి, ఏప్రిల్ 19 : జిల్లాలో పని చేస్తున్న కోర్టు డ్యూటీ, లైజనింగ్ అధికారులతో కోర్టు వర్టికల్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ రాజేశ్‌చంద్ర మాట్లాడుతూ.. నేరస్థులకు శిక్ష పడితేనే నేరాల సంఖ్య తగ్గుతుందని, బాధితులకు న్యాయం జరిగేలా కోర్టు కానిస్టేబుళ్లు కృషి చేయాలని అన్నారు. దోషులకు శిక్ష పడడంలో బాధ్యతగా వ్యవహరించాలని చెప్పారు. సమావేశంలో అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ మురళి, ఐటీ సెల్, కోర్టు డ్యూటీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న టీజీఈజేఏసీ నాయకులు

కామారెడ్డి, ఏప్రిల్ 19 : టీజీఈజేఏసీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికై రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డికి శనివారం టీజీఈజేఏసీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగుల పెండింగ్ బిల్స్, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు, పీఆర్‌సీ, హెల్త్ కార్డులు, సీపీఎస్ రద్దు, పెన్షనర్ల బకాయిలు, అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజ్ తదితర సమస్యల గురించి సీఎంతో చర్చించి త్వరగా పరిష్కరించాలని అన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీజీఈజేఏసీ చైర్మన్ నరాల వెంకట్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ దేవేందర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు శ్రీనివాస్, బాబు, నాగరాజు, సాయిరెడ్డి, హన్మంత్ రెడ్డి, రాజు, దేవులా తదితరులు పాల్గొన్నారు.

# అర్హులు ఇండ్లు నిర్మించుకునేలా చూడాలి

బీబీపేట్, ఏప్రిల్ 19 : అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునేలా చూడాలని ఎంపీవో అబ్బాగౌడ్ అన్నారు. మండలంలోని మల్కాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన వారు నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. తదితర అంశాలపై చర్చించి అనంతరం గ్రామంలో శుక్రవారం గాలి బీభత్సవానికి ఇంటిపై నుంచి కొట్టుకుపోయిన రేకుల తదితర వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన అధికారులు

రామారెడ్డి, ఏప్రిల్ 19 : రామారెడ్డి మండలం కన్నాపూర్ గ్రామంలో శుక్రవారం కురిసిన వడగండ్ల వర్షానికి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఆరబోసిన 1100 ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. శనివారం ఉదయం సొసైటీ చెర్మన్ సదాశివారెడ్డి, సివిల్ సప్లై అధికారులు నర్సింహరావు, శ్రీనివాస్, మానిటరింగ్ అధికారి సాయిలు కొనుగోలు కేంద్రం వద్ద తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్‌కు తరలించినట్లు సొసైటీ చెర్మన్ తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు అని అన్నారు.

## హైదరాబాద్‌లో ఎల్లారెడ్డివాసికి సన్మానం

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 19 : 25 సార్లు రక్తదారం చేసి పలువురికి ఆదర్శంగా నిలిస్తున్న ఎల్లారెడ్డి వాసి పబ్బ నగేశ్‌ను శనివారం సన్మానించారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో కామారెడ్డి రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైశ్యాఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారుల కోసం నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఎల్లారెడ్డికి చెందిన పబ్బ నగేశ్ 25వ సార్లు రక్తదానం చేశాడు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ శాలువా కప్పి, మెమెంటో ఇచ్చి సన్మానించారు.

## ప్రపంచ వారసత్వ దినోత్సవం

బీబీపేట్ (దోమకొండ), ఏప్రిల్ 19 : ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకొని దోమకొండలోని చారిత్రత్మక కట్టడాలైనా బురుజు, ఉపగడ్డ, గడి కోట గురించి వివరిస్తూ విద్యార్థులు ప్రధాన వీధులగుండా శనివారం ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు వారసత్వ సంపదపై అవగాహన కల్పించారు.



దోమకొండలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

# కల్తీ కల్లు తాగితే ప్రాణాలకు హాని



మాట్లాడుతున్న యాంటీ నార్కొటిక్ బ్యూరో సివన్ నాయుడు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఏప్రిల్ 19: కల్తీ కల్లు (ఆల్ప్రాజోలం, డైజోఫాంల తయారీ), గంజాయి, మత్తుపదార్థాలు సేవించడంతో ప్రాణాలకు హాని అని యాంటీ నార్కొటిక్ బ్యూరో సివన్ నాయుడు అన్నారు. ఎల్లారెడ్డిలో శనివారం ఏర్పాటుచేసిన కల్తీ కల్లుపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చెట్టు నుంచి తీసిన కల్లు స్థానంలో ఆల్ప్రాజోలం, డైజోఫాంలతో తయారు చేసిన కల్తీకల్లు ప్రస్తుతం రాజ్యమేలుతున్నదని చెప్పారు. గంజాయి, కల్తీ కల్లును నివారించి సమాజాన్ని కాపాడుకునే బాధ్యత మనదేనన్నారు. ఆల్ప్రాజోలం, డైజోఫాంలతో తయారు చేసిన కల్లు తాగడంతో వ్యక్తి గాఢమైన మత్తులోకి జారిపోతాడని, శ్వాసకోస సమస్యలు తలెత్తుతాయన్నారు. హార్ట్ ఎటాక్‌కు వస్తుందన్నారు. అనంతరం టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ సీఐ సుందల్‌సింగ్, ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్, మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కుమార్ కల్తీకల్లు తాగితే కలిగే అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ సిబ్బంది నవీన్‌రెడ్డి, ఆమోజ్, సరిత, ఎల్లారెడ్డి పోలీసు సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు తదితరులున్నారు. మండలంలోని వెల్లుట్ల, గండిమాసానిపేట్, రుద్రారం గ్రామాల్లో తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించి, కల్తీ కల్లు నివారణపై, తాగితే కలిగే అనర్థాలపై ప్రజలకు వివరించారు. లింగంపేటలో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, పోలీసులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నార్కొటిక్ విభాగం సీఐ రాంప్రసాద్ మత్తు పదార్థాలు, డ్రగ్స్, కల్తీకల్లు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై వెంకట్‌రావు, ఎక్సైజ్ ఎస్సై జగన్మోహన్, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వహీద్ సిద్దిఖీ. ఏపీఎం చామంతి శ్రీనివాస్, ఎంపీడీవో నరేశ్, ఎంపీవో మల్హరీ, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. తాడ్వాయితోపాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సులు నిర్వహించినట్లు నార్కొటిక్ విభాగం సీఐ కృష్ణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో సదాశివనగర్ సీఐ సంతోష్, తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వర్లు, ఎక్సైజ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. భిక్కనూరు, దోమకొండ, బీబీపేట, రాజంపేట, మద్నూర్, నిజాంసాగర్, బిచ్కుంద, పెద్ద కొడప్‌గల్, పిట్లం, మాచారెడ్డి మండల కేంద్రాలతోపాటు ఆయా గ్రామాల్లో కల్తీ కల్లు, మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాన్సువాడ మండలం దేశాయిపేట్ గ్రామంలో కల్తీ కల్లు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నార్కొటిక్ డీఎస్పీ సుబ్బిరాంరెడ్డి అన్నారు. గాంధారితోపాటు పలు గ్రామాల్లో డ్రగ్స్, కల్తీ కల్లు పై అబ్కారి అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నార్కొటిక్స్ విభాగం డీఎస్పీ సోమనాథం, గాంధారి ఎస్సై ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

కామారెడ్డి, ఏప్రిల్ 19 : పశ్చిమ బెంగాల్లో హిందువులపై దాడిని ఖండిస్తూ విశ్వ హిందూ పరిషత్ కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలియజేసి కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ విభాగ్ ప్రముఖ్ గోపాలకృష్ణ మాట్లాడుతూ.. దేశంలో హిందువులకు రక్షణ లేకుండా పోతున్నదని అన్నారు. హిందువులపై దాడు లు జరుగుతున్నా పశ్చిమబెంగాల్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. బెం గాల్ ప్రభుత్వంపై చర్య తీసుకోవాలని, అక్కడ రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి అమ్ముల శ్రీనివాస్, సభ్యులు పాపారావు, జిల్లా ప్రచార ప్రముఖ్ శ్రీకాంత్ రావు, అశోక్, వంగప్రసాద్, విశ్వం గుప్త, భాస్కరాచారి, రాజు, శివ పాల్గొన్నారు.

## కార్మిక చట్టాలను అమలు చేయాలి

కామారెడ్డి, ఏప్రిల్ 19 : కార్మిక చట్టాలను అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసఫ్ అన్నారు. జిల్లా కేంద్రంలో జిల్లా ఏఐటీయూసీ కౌన్సిల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక చట్టాలు, సుప్రీంకోర్టు జీవోను అమలు చేయకుండా ఆర్టీసీ, సింగరేణి లాంటి వాటిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పిందని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలరాజు, ప్రముఖ న్యాయవాది వీఎల్ నరసింహారెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు దశరథ్, వర్కంగ్ ప్రెసిడెంట్ రాములు, సురేఖ, రాజిరెడ్డి, ప్రవీణ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఈతకు వెళ్లి యువకుడి మృతి

భిక్కనూరు, ఏప్రిల్ 19 : స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు వెళ్లి యువకుడు మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామ శివారులోని ఓ స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు వెళ్లిన మెదక్ జిల్లా చేగుంట చెందిన సంజ య్(23) మృతి చెందాడు. స్విమ్మింగ్ చేసే సమయంలో ఫిట్స్ రావడంతో స్థానికులు రామాయంపేట్ దవాఖానకు తరలించారు. మార్గమధ్యంలోనే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## సౌకర్యాలు కల్పించాలి

లింగంపేట/నిజాంసాగర్, ఏప్రిల్ 19 : సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించాలని జిల్లా సహకార సంఘం అధికారి రామ్మోహన్ సూచించారు. లింగంపేట మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఆయన వెంట ఏఎస్‌వో నర్సింహులు, సీఈవో శ్రీనివాస్, రైతులు అశోక్‌రెడ్డి, చందర్ తదితరులు ఉన్నారు. నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట, గోర్గల్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను విజిలెన్స్ అధికారులు పరిశీలించారు.

**కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

బిచ్కుంద(జుక్కల్), ఏప్రిల్ 19 : రైతులు జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సౌజన్య అన్నారు. జుక్కల్ మండలం కేంరాజ్ కల్లాలి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆమె శనివారం ప్రారంభించారు. జుక్కల్ సొసైటీ చైర్మన్ శివానంద్, జుక్కల మాజీ సర్పంచ్ రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఒకరి రిమాండ్

కామారెడ్డి, ఏప్రిల్ 19 : పాల్వంచ మండలంలోని ఫరీద్‌పేట గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ జీడీపల్లి నర్సింహారెడ్డిపై తన మేనల్లుడు గురిజాల మధుసూదన్‌రెడ్డి సోషల్ మీడియా, కొన్ని పత్రికల ద్వారా గత అరునెలల నుంచి తప్పుడు ప్రచారం చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నాడన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు మాచారెడ్డి ఎస్సై అనిల్ తెలిపారు. ఎడపల్లి మండలానికి చెందిన గురిజాల మధుసూదన్‌రెడ్డి మాజీ వైస్‌ఎంపీపీ నర్సింహారెడ్డిని పాల్వంచలో ప్రభుత్వ భూమి ఆక్రమించి ప్లాట్లు వేసి, షట్టర్లు అక్రమంగా నిర్మించారని సోషల్ మీడియా, కొన్ని పత్రికల ద్వారా తప్పుడు ప్రచారం ఎందుకు చేస్తున్నావని నర్సింహారెడ్డి ప్రశ్నించగా రూ.40లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడని ఆయన తెలిపారు. నర్సింహారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మధుసూదన్‌రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు మాచారెడ్డి ఎస్సై అనిల్ వివరించారు.

## ధాన్యం డబ్బులు జమ

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 19 : ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతుల ఖాతాల్లో ఇప్పటివరకు 13కోట్ల 46 లక్షల రూపాయలను జమ చేశామని డీఆర్డీవో సురేందర్ అన్నారు. శనివారం ఆయన ఎల్లారెడ్డి పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఐకేపీ ద్వారా 183 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కొనుగోలు కేంద్రాల ద్వారా 9,927 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 867 మంది రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఆయనతోపాటు ఏకేపీ ఏపీఎం ప్రసన్నారాణి ఉన్నారు.

## స్విచ్చులు బిగింపు

లింగంపేట, ఏప్రిల్ 19: లింగంపేట సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు సెక్షన్లలో 58 ఏబీ స్విచ్చులు బిగించినట్లు విద్యుత్ శాఖ ఏడీఈ మల్లేశ్ శనివారం తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన సమయంలో ఏబీ స్విచ్చులు ఆఫ్ చేసుకుని సమస్యను పరిష్కరించుకోవచ్చన్నారు. శెట్పల్లిసంగారెడ్డి సెక్షన్‌లో 24, గాంధారి సెక్షన్‌లో 18, సర్వాపూర్ సెక్షన్‌లో 6, లింగంపేట సెక్షన్‌లో 9 ఏబీ స్విచ్చులు బిగించినట్లు తెలిపారు.


నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**BRS T-SHIRTS**

★ వరంగల్ దగ్గర ఎల్కతుర్తిలో జరిగే BRS సభకు మీ నాయకుడి & మీ ఫోటోతో ఉన్న T-SHIRTS మీరు కోరిన విధంగా ప్రింట్ చేసి ఇస్తాము. 7416385350.

NT-325302-All

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


# 'భూభారతి'తో సమస్యలు పరిష్కారం



దరఖాస్తులు స్వీకరిస్తున్న డిప్యూటీ కలెక్టర్ రాజేందర్

లింగంపేట, ఏప్రిల్ 19 : భూభారతి చట్టంతో సమస్యలు పరిష్కరించనున్నట్లు డిప్యూటీ కలెక్టర్ రాజేందర్ వెల్లడించారు. లింగంపేట మండలంలోని బాయంపల్లి, కన్నాపూర్ గ్రామాల్లో శనివారం భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెలాఖరు వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో నాలుగు మండలాలను పైలెట్ మండలాలుగా ప్రభుత్వం ఎంపిక చేసినట్లు తెలిపారు. బాయంపల్లి గ్రామంలో సర్వే నంబర్ 19, 75లో ఉన్న వ్యవసాయ భూములు సీలింగ్ ఉన్నందున పట్టాలుగా మార్చి ఇవ్వాలని రైతులు దరఖాస్తులు చేసినట్లు తెలిపారు. మే నెలలో రికార్డులను పరిశీలించి సమస్య పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. కన్నాపూర్‌లో ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేశ్, అటవీ శాఖ ఎఫ్ఆర్‌వో ఓంకార్, సెక్షన్ అధికారి భాస్కర్, మండల పంచాయతీ అధికారి మల్హరీ, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు



కామారెడ్డిలోని షాపింగ్ మాల్‌లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది



ఎల్లారెడ్డిలోని సీవీఆర్ షాపింగ్ మాల్‌లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కామారెడ్డి/ఎల్లారెడ్డి రూరల్/మద్నూర్, ఏప్రిల్ 19 : అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని పలు బట్ట దుకాణాల్లో అగ్ని ప్రమాదాలపై ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించా రు. ఈ సందర్భంగా అగ్నిమాపక కేంద్రం అధికారి అబ్దుల్ సలాం మాట్లాడుతూ.. ప్రజలకు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సి న జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని సీవీఆర్ షాపింగ్ మాల్‌లో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అగ్నిమాపక సిబ్బంది వివరించారు. విద్యుత్ ప్రమాదాలు జరిగిన సమయంలో నీటిని ఉపయోగించరాదని సూచించారు. అగ్నిప్రమాదాలు జరిగే ఆస్కారమున్న ప్రదేశాలను ముందే గుర్తించి అక్కడ తగిన చర్యలను తీసుకోవాలన్నారు. అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో బయటికి వెళ్లే మార్గంలో ఎటువంటి ఆటంకాలూ కలుగకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో షాపింగ్ మాల్స్ యజమానులు, సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది తదితరులున్నారు. మద్నూర్‌లో అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించి ఫైర్ అధికారి రాజయ్య ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది నర్సింహులు, రాణాప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.